## లక్షలు వెచ్చించి.. లక్షణంగా వదిలేసి..



మూలన పడేసిన డ్రోన్

హాజీపూర్, మే 10 : హాజీపూర్ మండల సమాఖ్య ఆధ్వర్యంలో 2022లో నేషనల్ రూరల్ లైవ్‌లీహుడ్ మిషన్ (ఎన్‌ఆర్ఎల్‌ఎం) పథకం ద్వారా రూ. 10 లక్షల(రూ.2.50 లక్షల సబ్సిడీ)తో డ్రోన్ కొనుగోలు చేయగా, ప్రస్తుతం అది నిరుపయోగంగా మారింది. మొదటి సంవత్సరంలో 54 మంది రైతులకు సంబంధించిన 109 ఎకరాల్లో మందు పిచికారి చేసిన డ్రోన్ రూ.31 వేల వరకూ సంపాదించింది. ఆపై దాని బ్యాటరీలు సక్రమంగా పనిచేయకపోవడంతో హైదరాబాద్‌కు తీసుకెళ్లి మరమ్మతులు చేయించారు. తిరిగి తీసుకొచ్చి డ్రోన్ వినియోగిస్తున్న సమయంలో బ్యాటరీలు డిచ్చార్జి అవుతూ.. పైకి ఎగిరిన కొంత సేపటికే కింద పడిపోతున్నది. తిరిగి రిపేర్ చేయించలేక ఓ మూలన దానిని పడేశారు.

# తాగునీటి తిప్పలు కంటితుడుపు చర్యలు

**మారుమూల గ్రామాల్లో గొంతు తడుపుకునేందుకు తండ్లాట**

- 'మిషన్ భగీరథ' పైపులైన్‌లకు మరమ్మతులు కరువు
- శాశ్వత పరిష్కారానికి అవకాశమున్నా.. తాత్కాలిక చర్యలకే ప్రాధాన్యం

*యంత్రాంగం ముందు చూపులేని కారణంగా మారుమూల గ్రామాల ప్రజానీకం తాగు నీటికి తండ్లాడుతున్నది. వేసవిని దృష్టిలో పెట్టుకొని ముందస్తు చర్యలు చేపట్టాల్సి ఉండగా, పట్టింపులేనితనంతో బిందెడు నీటికి అష్టకష్టాలు పడాల్సి వస్తున్నది. మిషన్ భగీరథ నీటి సరఫరాలో తలెత్తే చిన్న చిన్న మరమ్మతులను సైతం చేయడం లేదు. అప్పటికప్పుడు నామమాత్రపు చర్యలు చేపడుతున్నారే తప్ప శాశ్వత పరిష్కారం చూపడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. శాశ్వతంగా పరిష్కరించే వీలున్నప్పటికీ గ్రామ పంచాయతీల ట్యాంకర్లతో నీటిని సరఫరా చేస్తూ.. తాత్కాలిక పరిష్కారాలకే ప్రాధాన్యమిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.*

*- కుమ్రం భీం ఆసిఫాబాద్, మే 10 (నమస్తే తెలంగాణ)*

### అందని మిషన్ భగీరథ..



బెజ్జూర్ మండల కేంద్రంలో గ్రామం పంచాయతీ ట్రాక్టర్‌తో నీటిని అందిస్తున్న అధికారులు

**బెజ్జూర్ మండల కేంద్రంలోని** బెస్తవాడ, ఎస్సీ కాలనీలో మిషన్ భగీరథ వాటర్ ట్యాంకు, ఇంటింటికీ నల్లాలు ఉన్నప్పటికీ .. అవి పని చేయడం లేదు. పైపులైన్ లీకేజీవల్ల తాగు నీరు సరఫరా కావడం లేదు. వాటికి మరమ్మతులు చేయాల్సిన అధికారులు గ్రామ పంచాయతీ ట్యాంకర్ ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు. శాశ్వత పరిష్కారం చూపకుండా తాత్కాలిక పరిష్కారానికే ప్రాధాన్యత ఇస్తున్నారు.

### ఒకే బావికి 7 మోటర్లు

**ఇది బెజ్జూర్ మండల** కేంద్రంలోని బెస్తవాడ. ఒకే బావికి ఏడు మోటర్లు ఏర్పాటు చేసి కాలనీవాసులు నీటిని తోడుకుంటున్నారు. మిషన్ భగీరథ ద్వారా నీరు సరఫరా చేసే అవకాశం ఉన్నప్పటికీ అధికారులు ఆ దిశగా చర్యలు చేపట్టడం లేదు. ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలున్నాయి.



బెజ్జూర్ మండల కేంద్రంలోని బెస్తవాడలో ఒకే బావికి ఏడు మోటర్లు ఏర్పాటు చేసుకొని నీటిని తోడుకుంటున్న ప్రజలు




వాంకిడి మండలం ఎనోలి గ్రామంలో.. వాటర్ ట్యాంర్ వస్తేనే నీళ్లు

### ట్యాంకర్ వస్తేనే నీళ్లు..

**వాంకిడి మండలం** ఎనోలి గ్రామానికి సుమారు నెల రోజులుగా ట్యాంకర్ ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు. తమ గ్రామంలో నెలకొన్న నీటి సమస్య పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఇటీవల గ్రామస్తులు కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. ఇందుకు స్పందించిన అధికారులు గ్రామ పంచాయతీ వాటర్ ట్యాంకర్ ద్వారా నీటిని అందించడం ప్రారంభించారు. ఏదైనా కారణంతో వాటర్ ట్యాంకర్ రాకపోతే గ్రామస్తులు నీటికి తీవ్ర ఇబ్బందులు పడాల్సిందే. మిషన్ భగీరథ ద్వారా నీటిని సరఫరా చేయకుండా అప్పటి మేరకు ట్యాంకర్ ద్వారా నీరు సరఫరా చేస్తున్నారు.

# మెడికల్ కాలేజీని వేగంగా పూర్తిచేయాలి

- పీఎస్సార్ ధ్యాసంతా అక్రమ సంపాదన మీదే
- ఇప్పటికిప్పుడు ఎన్నికలొస్తే బీఆర్ఎస్‌దే విజయం
- మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే దివాకర్ రావు



గుడిపేటలోని మెడికల్ కాలేజీ నిర్మాణాన్ని పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే దివాకర్ రావు

హాజీపూర్, మే 10 : మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని గుడిపేటలో నిర్మిస్తున్న మెడికల్ కాలేజీ, కేంద్రీయ విద్యాలయాన్ని వేగంగా పూర్తి చేయాలని మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు కోరారు. శనివారం వాటి పనులను బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు నడిపెల్లి విజిత్‌రావు, నాయకులతో కలిసి పరిశీలిచారు. మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తెలంగాణకు ఒక్క మెడికల్ కళాశాల ఏర్పాటు చేసింది లేదని, తెలంగాణ రాష్ట్రం వచ్చాక తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ జిల్లాకో మెడికల్ కళాశాల ఏర్పాటు చేశారని కొనియాడారు. మెడికల్ కళాశాల నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేసి ఈ ఏడాదిలో అందుబాటులోకి తీసుకరావాలని సంబంధిత కాంట్రాక్టర్, అధికారులను కోరారు. గత ప్రభుత్వ హయాంలో అప్పటి ఎంపీ వెంకటేశ్ నేత సహకారంతో గుడిపేటలో రూ. 26 కోట్లతో కేంద్రీయ విద్యాలయం ఏర్పాటుకు శంకుస్థాపన చేశారన్నారు. ప్రస్తుత ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావుకు అక్రమ సంపాదన మీద ఉన్న ధ్యాస.. అభివృద్ధిపై లేదన్నారు. ప్రేంసాగర్‌రావు చేస్తున్న అరచకాలు, కాంగ్రెస్ పార్టీ పట్ల ప్రజలు విసుగెత్తి పోయారని, ఇప్పటికిప్పుడు ఎన్నికలు వచ్చినా ప్రజలంతా బీఆర్ఎస్ పార్టీని గెలిపించుకునేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. మెడికల్ కళాశాల నిర్మాణం తొందరగా పూర్తయితే బీఆర్ఎస్ పార్టీకి, దివాకర్‌రావుకు పేరు వస్తుందని నిర్మాణ పనుల్లో జాప్యం చేస్తున్నారని పేర్కొన్నారు. ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడిన మాటలు ఇప్పటి వరకు ఏ ముఖ్యమంత్రి కూడా మాట్లాడలేదని, కాంగ్రెస్ పాలనకు ముఖ్యమంత్రి మాటలే నిదర్శనమన్నారు. అనంతరం బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు విజిత్ రావు మాట్లాడుతూ బీఆర్ఎస్ సర్కారులో చేపట్టిన పనులకు కొన్ని మార్పులు చేసి తామే చేశామని కాంగ్రెసోళ్లు గొప్పలు చెప్పుకోవడం సిగ్గు చేటన్నారు. మాజీ మంత్రి హరీశ్‌రావు చేతుల మీదుగా పడ్తన్‌పల్లి గ్రామ శివారులో హాజీపూర్ మండల రైతులకు సాగు నీరందించేందుకు కొత్త లిఫ్టుకు శంకుస్థాపన చేస్తే దానిని రద్దు చేసిన ఘనత పీఎస్సార్‌కే దక్కుతుందన్నారు. అంతేగాకుండా మంచిర్యాలలో గోదావరిపై అంతర్గాం వైపునకు బ్రిడ్జి నిర్మించేందుకు భూమి పూజ చేయగా, ఆట్టి బ్రిడ్జిని సైతం రద్దు చేశారని తెలిపారు. వీరి వెంట హాజీపూర్ మండలాధ్యక్షుడు మొగిళి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి జీవన్ రావు, మాజీ వైస్ ఎంపీపీ శ్రీనివాస్, మండల సర్పంచ్‌ల ఫోరం మాజీ అధ్యక్షుడు, సర్పంచ్ గొల్ల శ్రీనివాస్, మాజీ సర్పంచ్‌లు జాడి సత్యం, అనె మల్లేశ్, పార్టీ కార్పొరేషన్ అధ్యక్షుడు గాదె సత్యం, నాయకులు పడాల రవిందర్, వొడ్నాల రవీందర్, తోట తిరుపతితో పాల్గొన్నారు.

## వివాదాల పరిష్కారానికే కమ్యూనిటీ మీడియేషన్ సెంటర్లు

**హైకోర్టు యాక్టింగ్ చీఫ్ జడ్జి సుజోయ పాల్**





మాట్లాడుతున్న యాక్టింగ్ చీఫ్ జడ్జి సుజోయ పాల్, పాల్గొన్న అధికారులు, న్యాయమూర్తులు

కుమ్రం భీం ఆసిఫాబాద్, మే 10 (నమస్తే తెలంగాణ): వివాదాలు పరిష్కరించేందుకే కమ్యూనిటీ మీడియేషన్ సెంటర్లు ఏర్పాటు చేస్తున్నట్లు హైకోర్టు యాక్టింగ్ చీఫ్ జడ్జి సుజోయపాల్ అన్నారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎంవీ రమేశ్, కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే, ఎస్పీ డీవీ శ్రీనివాసరావు, పీవో కుష్బూ గుప్తా, న్యాయమూర్తులు యువ రాజా, అనంతలక్ష్మి, అజయ్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రాపర్తి రవీందర్‌తో కలిసి కమ్యూనిటీ మీడియేషన్ సెంటర్‌ను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇరువర్గాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలన్న సదుద్దేశంతో ఈ కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళ్తున్నామన్నారు. రాష్ట్రంలో నిజామాబాద్, కామారెడ్డి, హైదరాబాద్, హనుమకొండలో ఈ సెంటర్లను ప్రారంభించినట్లు తెలిపారు. మారుమూల జిల్లా అయిన కుమ్రం భీం ఆసిఫాబాద్‌లో ఈ సెంటర్ ప్రారంభించడం చాలా ఆనందంగా ఉందన్నారు. 2023లో కమ్యూనిటీ మీడియేషన్ చట్టాన్ని ప్రభుత్వం తీసుకువచ్చిందని తెలిపారు. ప్రస్తుత కాలంలో మనస్పర్థలతో బంధాలు విచ్ఛిన్నమవుతున్నాయని, వాటిని మధ్యవర్తిత్వం ద్వారా పరిష్కరించే అవకాశముందన్నారు. కమ్యూనిటీ మీడియేషన్ సెంటర్ ద్వారా సమస్యలు పరిష్కరించేందుకు పలు కమ్యూనిటీల సభ్యులు ముందుకు రావాలని, వారికి మూడు రోజులపాటు శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు.

## అటవీ భూములు దున్నితే చర్యలు

కోటపల్లి, మే 10 : అటవీ భూములు దున్నితే చర్యలు తప్పవని సీసీఎఫ్ శాంతారాం హెచ్చరించారు. కోటపల్లి మండలం పిన్నారం గ్రామంలో అటవీ అధికారులు రైతుల ఇండ్లకు వెళ్లి అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నారని ఇటీవల బీజేపీ నాయకులు ఫారెస్ట్ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయగా, శనివారం సీసీఎఫ్ శాంతారాం అటవీ భూములను సందర్శించారు. హక్కు పత్రాలు ఉన్నవారే అటవీ భూములు సాగు చేయాలని సూచించారు. ఇతరులు దన్నితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



భూములను పరిశీలిస్తున్న సీసీఎఫ్ శాంతారాం, అటవీ అధికారులు

# జై జవాన్

**ఆపరేషన్ సిందూర్‌కు సబ్బండ వర్గాల మద్దతు**

- భారత సైనికులు విజయం సాధించాలని ఆలయాల్లో ప్రత్యేక పూజలు
- పలుచోట్ల సంఘీభావ ర్యాలీలు
- వీర జవాన్‌లకు ఘన నివాళి





పూజలు చేస్తున్న గౌడ కులస్తులు

హాజీపూర్, మే 10 : 'ఆపరేషన్ సిందూర్'కు సబ్బండ వర్గాలు మద్దతు తెలుపుతున్నాయి. పాకిస్తాన్‌తో జరుగుతున్న యుద్ధంలో భారత సైనికులు విజయం సాధించాలని కాంక్షిస్తూ ప్రత్యేక పూజలు చేస్తున్నాయి. సైన్యానికి సంఘీభావంగా ర్యాలీలు తీస్తున్నాయి. జై జవాన్.. భారత్ మాతాకీ జై.. అంటూ నినాదాలతో హోరెత్తిస్తున్నాయి. మంచిర్యాల జిల్లా హాజీపూర్ మండలం పెద్దంపేటలో గౌడ సంఘం ఆధ్వర్యంలో రేణక ఎల్లమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. యుద్ధంలో పాల్గొంటున్న భారత సైనికుల్లో మనోధైర్యం నింపాలని అమ్మ వారిని కోరినట్లు వారు తెలిపారు. ఉగ్రవాదుల దాడిలో మరణించిన వారికి, వీర జవాన్‌లకు ప్రగాఢ సంతాపం తెలిపారు.

*కాగజ్‌నగర్, మే 10 : కాగజ్‌నగర్ పట్టణంలోని ఎస్పీఎం గ్రౌడ్‌లో వాకర్స్ ఆధ్వర్యంలో భారత జవాన్లకు సంఘీభావంగా ర్యాలీ తీశారు. అమరుడైన భారత్ జవాను మురళీనాయక్‌కు నివాళులు అర్పించారు. వాకర్స్ ముంజం ఆనంద్ కుమార్, ములకల సుభాశ్, బొడేకరే రాము, మధూకర్, రమేశ్, శ్రీనివాస్, రాంచందర్ పాల్గొన్నారు.*



ర్యాలీలో పాల్గొన్న కాగజ్‌నగర్ పట్టణ ప్రజలు

### జవాన్‌ల ఆత్మకు శాంతి కోసం..

*కెరమెరి, మే 10 : మండల కేంద్రంలోని గాంధీ విగ్రహం వద్ద వీర జవాన్‌ల ఫొటోలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. అనంతరం కెరమెరి మార్కెట్‌లో సంఘీభావ ర్యాలీ తీశారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్యాంనాయక్, షేక్ రజక్, సుదర్శన్, రమేశ్, వెంకట్‌నాయక్, తదితరులు పాల్గొన్నారు.*




కెరమెరి మండల కేంద్రంలో అమరులైన జవాన్‌లకు శ్రద్ధాంజలి ఘటిస్తున్న నాయకులు

### వీర తిలకం దిద్ది.. సాగనంపి..

*తాండూర్, మే 10 : జమ్మూ-కశ్మీర్‌లో భారత జవాన్‌గా విధులు నిర్వహిస్తూ సెలవులపై వచ్చిన ఓ సైనికుడికి గ్రామస్తులు వీర తిలకం దిద్ది తిరిగి యుద్ధానికి సాగనంపారు. తాండూర్ మండల కేంద్రంలోని సుభద్ర కాలనీకి చెందిన పుప్పాల లక్ష్మణ్ ఇటీవల సెలవుల నిమిత్తం ఇంటికి వచ్చారు. భారత్-పాక్ మధ్య యుద్ధం జరుగుతున్న నేపథ్యంలో అత్యవసర పరిస్థితుల్లో భారత ఆర్మీ పిలుపు మేరకు విధుల్లో చేరడానికి జమ్మూ-కశ్మీర్ వెళ్తున్న సైనికుడికి బీజేపీ నాయకులు సిందూరం దిద్ది.. ఘనంగా సన్మానించారు. భారత ఆర్మీ జవాన్‌ల కుటుంబానికి దేశం అండగా ఉంటుందన్నారు. నాయకులు పులగం తిరుపతి, చిలుముల శ్రీకృష్ణదేవరాయలు, కేశెట్టి విజయ్ కుమార్, తుకారం, పుట్ట కుమార్, కోమండ్ల శ్రీనివాస్, పుప్పాల మోహన్, మురళీ, శోభన్, బానేశ్ ఉన్నారు.*



తాండూర్‌లో జవాన్‌కు సిందూరం దిద్దుతున్న నాయకులు

### మంచిర్యాలలో విస్తృత తనిఖీలు

*మంచిర్యాల అర్బన్, మే 10 : ఇండియా-పాకిస్తాన్ మధ్య యుద్ధం జరుగుతున్న నేపథ్యంలో శనివారం మంచిర్యాలలో పోలీసులు విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. శనివారం జిల్లా కేంద్రంలోని రైల్వే స్టేషన్, బస్టాండ్, ప్రధాన చౌరస్తాల వద్ద బాంబ్ స్క్వాడ్, నార్కోటిక్ డాగ్స్‌తో విస్తృతంగా తనిఖీలు చేశారు. అనుమానితులుగా తిరుగుతున్న వారి వివరాలు సేకరించి, ఆధార్ కార్డులను పరిశీలించి వేలి ముద్రలు తీసుకున్నారు. మంచిర్యాల ఏసీపీ ప్రకాశ్ మాట్లాడుతూ నగరంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ఉండేందుకు ముందస్తు చర్యల్లో భాగంగా ఈ తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రార్థనా మందిరాలు, దేవాలయాల వద్ద రాత్రి, పగలు నిరంతరం తనిఖీలు నిర్వహిస్తామన్నారు. ఎవరైనా అనుమానితులు కనిపిస్తే డయల్-100కు.. లేక స్థానిక పోలీస్ అధికారులకు సమాచారమందించాలన్నారు. రెచ్చగొట్టే విధంగా పోస్టులు పెట్టిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తనిఖీల్లో పట్టణ సీఐ ప్రమోద్ రావు, ట్రాఫిక్ సీఐ సత్యనారాయణ, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.*



మంచిర్యాల రైల్వే స్టేషన్‌లో తనిఖీ చేస్తున్న పోలీసులు

### సంఘీభావ ర్యాలీ..

*మంచిర్యాల జిల్లా కేంద్రంలోని ఐబీ చౌరస్తా నుంచి బెల్లంపల్లి చౌరస్తా వరకు ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు, డీసీసీ జిల్లా అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ ఆధ్వర్యంలో సంఘీభావ ర్యాలీ తీశారు. వివిధ శాఖల అధికారులు, తాజా మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు, మహిళా నాయకురాలు, యువజన నాయకులు, విద్యార్థి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.*